క్లుప్తంగా

కాకునూర్‌లో కొండెంగల బెడద



గ్రామంలోని ఇళ్లపై ఉన్న కొండెంగలు

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్ గ్రామంలో కొండెంగల బెడదతో గ్రామస్తులు హడలిపోతున్నారు. కొండెంగలు ప్రజలను ఇంట్లో నుంచి బయటి రాన్విడం లేదని గ్రామస్తులు వాపోయారు. కొండెంగలు ఇంటి పైకప్పులను తొలగించే ప్రయత్నాలు చేస్తున్నాయని వారు తెలిపారు. అధికారులు స్పందించి గ్రామంలో కొండెంగల బెడద నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

మనోప్రగతి క్యాంపులతో లబ్ధి: ఏపీఎం భగవంతు



మాట్లాడుతున్న ఏపీఎం భగవంతు

కేశంపేట: మానసిక వికలాంగులు మనోప్రగతి క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం భగవంతు సూచించారు. మండల కేంద్రంలోని పునరావాస వికాస కేంద్రంలో నెలలో రెండుసార్లు క్యాంపును నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏపీఎం భగవంతు మాట్లాడుతూ... ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని మానసిక వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మానసిక వికలాంగులు క్యాంపును సద్వినియోగం చేసుకొని జిల్లా నుంచి వచ్చిన ప్రొఫెషనల్స్ సలహాలు, సూచనలు పాటించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్ కవిత, సీసీ నరసింహ, వసంత పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి ఘన సన్మానం



వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన వేణుగోపాల్‌రావును సోమవారం బ్రాహ్మణ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, సంఘం నాయకులు రవిశర్మ, రామారావు, మహేష్ శర్మ, రామ సత్యనారాయణ, భానుశర్మ, శ్రీమతమ్మ, శివ, సాయిశర్మ, సునీల్, రఘు, ఆండాలు, రత్నం పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ గురువయ్యగౌడ్, రాహుల్‌గుప్తా

షాబాద్: యువత సమాజ సేవలో పాలు పంచుకోవాలని షాబాద్ సీఐ గురువయ్యగౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో షాబాద్ బస్టాండ్ ఆవరణలో దండు వెంకటేశం గుప్తా జ్ఞాపకార్థం డీవీఎం ఫౌండేషన్ సహకారంతో దండు రాహుల్‌గుప్తా చలివేంద్రం ఏర్పాటు చేశారు. సీఐ గురువయ్యగౌడ్, ఎస్ఐలు మహేశ్వర్‌రెడ్డి, సత్యంలతో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లాభాపేక్షతో కాకుండా సేవాదృక్పథంతో పనిచేస్తే సంతృప్తి కల్గుతుందన్నారు. ప్రయాణికుల దప్పికను తీర్చేందుకు చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రాహుల్‌గుప్తా మాట్లాడుతూ.. నా తండ్రి దండు వెంకటేశంగుప్త జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మజ్జిగ, నిమ్మరసం వంటి పానియాలను తాగాలని సూ చించారు. మంచినీటితో పాటు అంబలి కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అశోక్, మజీద్, తదితరులున్నారు.

జిల్లా విద్యాధికారిని సస్పెండ్ చేయాలి

ఎస్ఎఫ్ఐ డిమాండ్

చేవెళ్ల: పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన రోజే తాండూరులో పేపర్ లీక్ కావడంపై ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షకార్యదర్శులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్‌లు తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ.. పేపర్ లీక్‌కు బాధ్యులైన వారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో ఈ ప్రభుత్వం చెలగాటమాడుతుందని ఆరోపించారు. మొన్న గ్రూప్స్, నేడు టెన్త్ పరీక్షల పేపర్ లీక్ మరి రేపు ఇంకా ఏ ముందోనని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా విద్యాధికారి వెంటనే రాజీనామా చేయాలని లేకుంటే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.



కొందుర్గు: చౌదరిగూడలో పరీక్షకు వెళ్తున్న విద్యార్థులు



శంకర్‌పల్లి: విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు

మొదటి రోజు ప్రశాంతం

షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గంలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలు మొదటి రోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. సమయానికి విద్యార్థినీ, విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు అధికారులు కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



వశిష్ట విద్యాలయం ఎదుట..



షాబాద్: హోలిస్పిరిట్ పాఠశాల వద్ద నంబర్లను చూసుకుంటూ..

ఆలయ నిర్మాణానికి విరాళం



కమిటీ సభ్యులకు చెక్కుఅందజేస్తున్న అభిషేక్

శంకర్‌పల్లి: అయ్యప్ప దేవాలయం నిర్మాణానికి దాతలు ముందు రావాలని బీఆర్ఎస్ నాయకుడు, శంకర్‌పల్లి మాజీ ఉపసర్పంచ్ సాత ప్రవీణ్‌కుమార్ కోరారు. పటాన్‌చేరు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ కుమారుడు అభిషేక్ గౌడ్ శంకర్‌పల్లి అయ్యప్ప దేవాలయం ముఖ ద్వారం నిర్మాణానికి రూ. 8లక్షల విరాళం ప్రకటించారు. ఈ మేరకు చెక్కును ఆలయ కమిటీ సభ్యులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు పాండు రంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు దండు మోహన్, జంగయ్య, మిర్యాల శ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల పంచాయతీకి మూడు అవార్డులు



అవార్డును అందజేస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, ఎంపీడీఓ రాజ్‌కుమార్

చేవెళ్ల: గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఎంపీపీ విజయలక్ష్మి, చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం చేవెళ్ల పంచాయతీకి వచ్చిన 3 జాతీయ పంచాయతీ అవార్డు 2022లను ఎంపీపీ విజయలక్ష్మి, ఎంపీడీఓ రాజ్‌కుమార్‌ల చేతుల మీదుగా సర్పంచ్ శైలజ, కార్యదర్శి వెంకట్‌రెడ్డిలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జాతీయ పంచాయతీ అవార్డుల్లో చేవెళ్ల పంచాయతీకి మూడు విభాగాల్లో అవార్డులు వచ్చినట్లు తెలిపారు. పెద్ద పంచాయతీ అయినప్పటికీ పోటీపడి అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. ఇలాగే, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించి గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శంగా మార్చాలని కోరారు. సర్పంచ్ శైలజ మాట్లాడుతూ.. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. గ్రామానికి మూడు విభాగాల్లో అవార్డులు రావడం సంతోషంగా ఉందని చెప్పారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్య క్రమంలో ఎంపీఓ విఠలేశ్వర్‌జీ ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయండి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్

మొయినాబాద్‌రూరల్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేలా ప్రతి కార్యకర్త పని చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్ అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్‌లో తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నాయకుడు మల్కాపురం యాదయ్య బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కంజర్ల ప్రకాష్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అవినీతి పాలనను అంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో పరిపాలన అధ్వానంగా ఉందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోర నర్సింహ్మరెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



యాదయ్యను బీజేపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ప్రకాష్‌గౌడ్

పేదల బతుకులు మారేదెప్పుడో..!



కాంగ్రెస్‌లో చేరుతున్న చెర్కుపల్లి గ్రామస్తులు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్

కొందుర్గు: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా ప్రజల బతుకులు మారలేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం కొందుర్గు మండలం చెర్కుపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు దాదాపు 30 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కేసీఆర్ కుటుంబం బాగుపడిందే తప్పా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో పేదల బతుకులు ఏమాత్రం మారలేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలు విసిగి వేసారని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు నరేందర్, రవీందర్, రమేష్, వెంకటేష్, వీరయ్య, మల్లేష్, అంజయ్య, శ్రీను, వినోద్, రాములు, వేణు, మహేష్ పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య త్యాగాలు మరువలేనివి

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య త్యాగాలు మరువలేనివని కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం కొమురయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. నిజాం నవాబుల వెట్టి చాకిరి విముక్తి, భూమి కోసం ఆయన చేసిన పోరాటాలు ప్రజల్లో చైతన్యం నింపాయని వివరించారు. కొమురయ్య త్యాగాలు, పోరాట పటిమను నేటి తరానికి తెలిసే విధంగా సీఎం కేసీఆర్ అధికారికంగా ఆయన జయంతి వేడుకలను నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శరత్‌చంద్రబాబు, తహసీల్దార్ రాములు, నాయకులు శ్రీనివాస్‌నాయక్, గోవిందునాయక్, తదితరులు పాల్గొన్నారు.



కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, తదితరులు

కనకమామిడిలో సర్వాయి పాపన్న వర్ధంతి



పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సత్యం

మొయినాబాద్‌రూరల్: అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమే భారతదేశానికి సుప్రీం అని రాష్ట్ర స్వేరోస్ సర్కిల్ కోకన్వీనర్ కర్రోల సత్యం అన్నారు. మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో ఆదివారం రాత్రి అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామిక రాజ్యాంగ రక్షణ కోసం ప్రతి పౌరుడు పోరాడాలని సూచించారు. ఖురాన్, బైబిల్, భగవద్గీత గ్రంథాలతో పాటు రాజ్యాంగాన్ని కూడా ప్రతి పౌరుడు చదివి తమ హక్కును తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహదేవ్, రాజు, యాదవ సంఘం కార్యదర్శి శేఖర్‌యాదవ్, గోపాల్‌యాదవ్, ఎర్ర గణేష్, ఎర్ర రాకేష్, బాలయ్య, అర్జున్, అభిషేక్, కృష్ణ, అంబేద్కర్ సంఘం సభ్యులు సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో మనమే నంబర్ వన్

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నందిగామ: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా ఉందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మామిడిపల్లిలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు నోముల పద్మారెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వాలు అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అన్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, కేసీఆర్ కిట్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్, పింఛన్ల పెంపు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, దళితబంధు, రైతుబంధు, రైతు బీమా, తదితర సంక్షేమ పథకాలతో రాష్ట్రం నంబర్ వన్‌గా నిలిచిందని వివరించారు. గత 65 ఏళ్లుగా అధికారంలో ఉన్న వారు ఇలాంటి సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టాలన్న కనీస ఆలోచన చేయలేదని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మన రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. అంతకుముందు పలు గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికలలో షాద్‌నగర్ ఎమ్మెల్యేగా ముచ్చటగా ముడోసారి అంజయ్యయాదవ్‌ను గెలిపిస్తే మంత్రి పదవి తప్పక వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ గణేష్, ఎంపీపీలు ప్రియాంక, రవీందర్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్లు మంజుల, అశోక్, రాజ్‌గోపాల్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, సర్పంచులు వెంకట్‌రెడ్డి, కవిత, స్వామీ, అశోక్, చంద్రారెడ్డి, రమేష్ గౌడ్, జెట్ట కుమార్, సంతోష, రజనీత, ఎల్లమ్మ, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు కాట్న లత, నాయకులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయండి

షాద్‌నగర్: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించ తలపెట్టిన మద్దూర్ కిసాన్ ర్యాలీని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనునాయక్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల, ఇంధనం ధరలతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై ఎనలేని భారం మోపుతుందన్నారు. సామాన్యులపై జీఎస్టీ భారాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలని, అలాగే, కార్మికులకు కనీస వేతనాలు కూడా ఇవ్వడం లేదని, కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయడంలో కేంద్రం విఫలమైందని ఆరోపించారు. ఢిల్లీలో నిర్వహిస్తున్న కిసాన్ ర్యాలీని కార్యక్రమానికి కర్షకులు, కార్మికులు, ఉద్యోగులు అన్ని రంగాల వారు తరలిరావాలని పిలుపునిచ్చారు.

చిరుధాన్యాలపై అవగాహన

సీడీపీఓ నాగమణి

షాద్‌నగర్‌రూరల్: చిరుధాన్యాలతో పోషక విలువలతో కూడిన ఆహారం లభిస్తుందని సీడీపీఓ నాగమణి అన్నారు. పోషణపక్షంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ నాగమణి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు రోజువారి ఆహారంలో కొర్రలు, సామలు, అరికలు, రాగులు, జొన్నలు, పప్పు దినుసులను ఆహారంగా తీసుకోవాలన్నారు. గర్భిణులు పాలు, పండ్లు, గుడ్లువంటి పౌష్టికాహారాన్ని తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఎంతో ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కిశోర బాలికలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆడపిల్ల సమాజానికి మణిహారం లాంటిదని, పుట్టిన ఆడబిడ్డను రక్షించుకోవాలని సూచించారు. బాలికలకు యుక్త వయస్సు వచ్చిన తరువాతనే వివాహాలు చేయాలని, ఆడపిల్లలకు ఏ ఆపద వచ్చిన వెంటనే 1098కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఆడపిల్లల చదువులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్న చౌలపల్లి అంగన్‌వాడీ టీచర్ సత్యమ్మ, పీర్లగూడ అంగన్‌వాడీ టీచర్ జానకమ్మను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలమణి , ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింలుకు జయశంకర్ అవార్డు అందజేత



అవార్డును అందుకుంటున్న జాంగారి నర్సింలు

షాద్‌నగర్‌రూరల్: బహుజన సాహిత్య అకాడమీ అందిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ జాతీయ అవార్డుకు ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జాంగారినర్సింలు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమవారం బహుజన సాహిత్య అకాడమీ సంస్థ జాతీయ అధ్యక్షుడు నల్లారాధాకృష్ణ చేతుల మీదుగా జాంగారినర్సింలు అవార్డును అందుకున్నారు. అనంతరం రాధాకృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో అలుపెరగని పోరాటంలో తమవంతు పాత్ర పోషించడం అభినందనీయమని కొనియాడారు. ప్రజల ఆకాంక్ష మేరకు జరిగిన ఉద్యమంలో బహుజనులందరిని ఏకతాటిపైకి తీసుకురావడంలో ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్ గౌతమ్, ప్రధాన కార్యదర్శి గంగాదేవి పాల్గొన్నారు.

మానపాటికి 'మహానంది జాతీయ అవార్డు'

షాద్‌నగర్‌రూరల్: కళారంగంలో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన నటరాజా కళానిలయం వ్యవస్థాపకుడు మానపాటి ప్రదీప్‌కుమార్ మహానంది జాతీయ అవార్డును అందుకున్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కబరిచిన వారిని గుర్తించి తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉగాది మహానంది జాతీయ అవార్డు పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో నిర్వహించిన కార్యక్రమంలో సరస్వతీ మాత ఉపాసకులు, డాక్టర్ దైవజ్ఞశర్మ, తెలుగు వెలుగు సాహితీ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌రావు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ యువజన అవార్డు గ్రహీత రాజ్‌కుమార్, గిన్నీస్ వరల్డ్ అవార్డు గ్రహీత డాక్టర్ శాంతికృష్ణమాచార్య చేతుల మీదుగా మానపాటి ప్రదీప్‌కుమార్ మహానంది జాతీయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పట్టణ ప్రముఖులు మానపాటిప్రదీప్‌కుమార్‌ను అభినందించారు. మహానంది జాతీయ అవార్డును అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ప్రదీప్‌కుమార్ తెలిపారు.



మహానంది జాతీయ అవార్డును అందుకుంటున్న ప్రదీప్‌కుమార్

శ్మశానవాటికకు స్థలం కేటాయించండి



హోంమంత్రి మహమూద్ అలీని కలిసిన మోకిల గ్రామస్తులు, ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండలంలోని మోకిల గ్రామంలో ముస్లిం శ్మశాన వాటిక, ఈద్గాకు స్థలం కేటాయించాలని సోమవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీని గ్రామస్తులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మోకిల గ్రామంలో ముస్లింలకు శ్మశాన వాటిక, ఈద్గాకు స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఈద్గా, శ్మశాన వాటికకు కేటాయించాలని కోరారు. కాగా, మంత్రి సానుకూలంగా స్పందించి వెంటనే స్థలం కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హరీశ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోపాల్‌రెడ్డి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫరీద్, మోకిల మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ ఖాజా, నాయకులు జానీ, ఫయాజ్, అయ్యుబ్, ఇబ్రహీం, సాధిక్ పాల్గొన్నారు.